# దీపం చెప్పిన కతలు

గోపిని కరుణాకర్

## దేవరెద్దు

మసక మసక చీకట్లో ప్రాణాలను అరిచేతుల్లో పెట్టుకుని పరిగెత్తతా వుండాడు.

దేవరెద్దు రంకెలేస్తా వస్తా వుండాది. దాని కండ్లు చుక్కలు మాదిరి మెరస్తా వుండాయి. పాము మాదిరి బుసపెడతా వుండాది. మెళ్ళోని మువ్వలు గణగణా మోగతా వుండాయి.

మండుతున్న తోకని పైకెత్తింది. దుమ్మును రేపుకుంటా కసిగా కుమ్మేదానికి కొమ్ముల్ని ఇసరతా వుండాది.

బలమంతా కాళ్ళల్లోకి తీసుకుని పరిగెత్తతా వుండాడు. వొళ్ళంతా చెమటలు పోసినాయి. నోరు పిడసకట్టింది. పరిగెత్తతా వుంటే రాయి తగులుకొని బొక్కబోర్లా పడినాడు. పొగలాగ దుమ్ము పైకిలేసింది.

కాళ్ళూ చేతులూ కొట్టకపొయినాయి. మూతి అదిరిపొయింది. పొండ్లు కదిలిపొయ్యి నెత్తురొచ్చింది.



పైకి లేసినాడు.

పరిగెత్తతా వుండాడు.

బొటనవేలికి రాయి తగిలి నెత్తురు కారతా వుండాది.

అరికాల్లో ఇరిగిన ముల్లు సలపతా వుండాది.

"దేవరెద్దు సంపేస్తింది.. కాపాడండి... కాపాడండి..." గొంతు చించుకుని అరస్తా వుండాడు.

ఎవురికీ వినపడడం లేదు.

కాలుతీసి కాలు పెట్టేదానికి కష్టంగా వుండాది. సుడిగాలిలో ఎండినాకులా పట్లీలు కొడతా వుండాడు.

ఎంత పరిగెత్తినా అడుగు ముందుకు పడడం లేదు.

దేవరెద్దు దెగ్గిరికొచ్చేసింది.

ముందుకు అడుగేద్దామంటే దారిలేదు. ముందర పెద్దబాయి. నిండుగా నీళ్ళతో తొణకతా వుండాది.

తిరిగి చూస్తే,

మిందికొచ్చేసింది ఎద్దు. ముందు చూస్తే బాయి. వెనక చూస్తే ఎద్దు.

ఎగిరి బాయిలో 'దబీమని' దూకినాడు.

* * *

రాత్తిరి బాగా నిద్దర పట్టేసింది రాజన్నకు. వాళ్ళమ్మ లేపేంతవరకూ మెలుకువ రాలేదు.

ఎద్దుల్ని తీసి చింతచెట్టు కింద కట్టేస్తుంటే పలపలా నాలుగు చినుకులు రాలినాయి.

తలెత్తి చూసినాడు.

ఏడున్నాయెూ గుంపులుగుంపులుగా వచ్చి పాలకొండ మింద వాలినాయి మోడాలు.

"ఈపొద్దు తప్పకుండా వానొస్తింది" అనుకొన్నేడు మనసులో.

వాళ్ళమ్మ చెయ్యిపట్టుకోని వీధిలోకి లాక్కొనొచ్చి,

"పాలకొండమింద గొర్రెల్ని మందలు మందలుగా తోలినట్టుండాయి గదా మోడాలు. ఈ పొద్దు తప్పకుండా వానొస్తింది" అంటా మోడాల్ని చూపించినాడు.

ముందు మోడాలు కల్లా చూసి,

మల్ల రాజన్న కళ్ళల్లోకి చూసి,

"వాన కురిస్తిందో లేదో తెలీదుగానీ నీ కండ్లల్లో మాత్తరం వాన కురస్తా వుండాది" అనింది.

"ఎన్ని దినాలైంది మా మోడాల్ని

చూసి'' అన్నేడు.

''తలకోన మూలన వాన దిగతా వుండాది'' తలకోన మూలకల్లా చూసి అనింది వాళ్ళమ్మ.

''తలకోన మూలన వాన దిగితే మనకు తప్పకుండా వాన పడితింది. ఎంగట్రవణస్వామీ! కరువుతీరా వాన కురవల్ల స్వామీ! నీ కొండకొచ్చి మొక్కు తీర్చుకుంటాను తండ్రీ'' అని తిరుమల కొండకల్లా మల్లుకోని మొక్కుకున్నాడు.

''దేవుడుండాడు వానపడకుండా యాడికి పోతింది'' అంటా గొడ్లకొట్టాంలోకి పొయ్యి దూడని వొదిలింది పాలు పిండేదానికి.

''ఏందిరా నాయాలా! ఆకాశంకల్లా ఎగమల్లుకోని చూస్తా వుండావు?'' అంటా రాజన్న బుజంమింద చెయ్యి పడింది.

తిరిగి చూసినాడు. వాళ్ళ క్రిష్ణమామ నవ్వతా మీసాలు దువ్వినాడు.

రంగంపేట నుంచి పొద్దున్నే వచ్చే బస్సులో దిగినట్టుండాడు.

''ఇప్పుడేనా రావడం మామా? అత్తా, పిల్లోల్లు బాగుండారా?'' అని అడిగినాడు.

''మీ అత్తకేమబ్బా గుండ్రాయి మాదిర్తో వుండాది'' అన్నేడు కిసకిసా నవ్వతా.

ఇద్దరూ ఇంట్లోకి వచ్చినారు.

''అమా ఎవురొచ్చినారో చూడు'' అంటా వాళ్ళమ్మని పిలిచినాడు.

పాలు పిండి పైకి లేస్తా చూసింది.

''ఊర్లో అంతా బాగుండారాన్నా?'' అని పలకరించింది.

''మేమంతా బాగేగాని. నువ్వేంది చెల్లే కట్టిపుల్ల మాదిరి ఎండిపాయినావు?'' అన్నేడు చెల్లిని చూసి.

''వారం రోజులు పట్టుకున్నె జొరం ఇడవలేదు. ఈపొద్దే అట్టా లేసి తిరగతా వుండాను'' చెప్పింది.

''ఆవుపాలు ఎన్నిస్తింది చెల్లే?'' అని అడిగినాడు.

''పొద్దున్నే ఆరేడు లీటర్లు పాలిచ్చేది. పచ్చిగడ్డి లేదు. ఎండుగడ్డి బంగారమై పాయింది. వట్టినేలను కొరకతా వుండాది. ఇప్పుడు పొద్దున్నే రెండు లీటర్లు ఇస్తుంది. ఆ పాలు హెరిటేజిడిపోకు పోసేస్తాం'' అని చెప్పింది.

ఆవుని చూసి,

''చూస్తానే తెలస్తా వుండాది. బొచ్చూడిపొయ్యి బొమికలు గూడా బయటపడిపాయినాయి'' అన్నేడు.


పాలకేను తీసుకోని సెంటరుకు యలబారినాడు.

ఈదిలోకొచ్చేసరికి గొర్రెలతాత ఎదురుపడినాడు. ఆ తాత చేతిలో గూడా పాలకేను వుండాది.

''ఎవురబ్బోడా మీ ఇంటికి చుట్టమొచ్చినట్టుండాడు'' అని అడిగినాడు.

''రంగంపేట నుంచి మా క్రిష్ణమామ వచ్చినాడు'' అని చెప్పినాడు.

''ఏమంట వచ్చింది? ఈసారన్నా నిన్ను ఒగ ఇంటోన్ని చేస్తాడంటనా లేదా?'' అని అడిగినాడు.



## గుల్‌పనాగ్ సరదా...

**గు**ల్‌పనాగ్ తెలుసుకదా? టీవీ యాంకర్,మాజీ అందాల రాణి. ఆ పిల్లకో చిత్రమైన సరదా వుంది. నెట్‌లో చాటింగ్ చేస్తుంది గంటలతరబడి. అదేమీ తప్పుకాదు గానీ ఆ పిల్ల తనను మగరాయుడి కింద పరిచయం చేసుకుని చాలామందితో హస్కేస్తుంటుంది. ఆడపిల్లలను కవ్విస్తుంటుంది. అలాగే తన స్నేహితులందరికీ ఈ మెయిల్ పంపించి తన పెళ్ళి అయిపోయిందనీ, వాళ్ళందరికీ ఆహ్వానాలు పంపించినా ఎవరూ రాలేదనీ కోప్పడుతుంది. పాపం వాళ్ళంతా నానాకంగారూ పడిపోయి జరిగినదానికి క్షమాపణ చెబుతూ బోలెడన్నీ బొకేలు, బహుమతులు పంపిస్తారు. అప్పుడు గుల్ అసలు విషయం చెబుతుంది. కానీ వాళ్ళు పంపించిన బహుమతులు మాత్రం వెనక్కివ్వదు. ఈ పిల్లకు వాళ్ళమ్మ త్వరగా పెళ్ళి చేయకపోతే ఏదో జరిగేట్లుందని సన్నిహితులు వాపోతున్నారు.

రాజన్న ముందు, ఆ తాత వెనక మాట్లాడుకుంటా నడస్తా వుండారు.

గొర్రెల తాత అడిగిన దానికి బదులు చెప్పకుండా నవ్వి ఊరుకొన్నేడు. రాజన్న మొనుసులో సుబద్ర మెదిలింది.

క్రిష్ణమామ పెద్దకూతురు సుపద్ర. సుపద్రకి రాజన్నకి చిన్నప్పుడే మాటైపాయింది. ఉయ్యాల్లో వేసిన రోజునే కోడల్ని చూసి ''నా కోడలు నా ఇంటి దీపం'' అని రాజన్న వాళ్ళమ్మ మురిసిపాయింది.

రంగంపేటకు పొయినప్పుడు,

వాళ్ళ మామ మడక దున్నుతుంటే రాజన్న గూడా మేడిపట్టుకుని వెంట నడిచేవాడు.

ఏం చేస్తాడో చూద్దామని చెప్పి మేడిని అందించి పక్కకు తప్పుకొనేవాడు వాళ్ళ మామ. రాజన్న ఏం చేసేవాడంటే మేడినందుకోని సాలు తప్పిన మడకని సాలుకేసి ఎద్దల్ని అదిలించేవాడు.

మడకను బలంగా అదిమిపట్టి సాలు తప్పకుండా దున్నతా వుంటే,

''నా అల్లుడు సేద్దింలో మొగలాయి అవతాడు. నాయాల నా కూతుర్ని నీకే ఇస్తారా'' అని మీసం మెలేసినాడు వాళ్ళ క్రిష్ణమామ.

మొన్న సంకురాతిరికి రంగంపేటకు పొయినప్పుడు సుపద్ర పైటలు వేస్తా వున్నింది. చిన్నప్పుడు పిలక జడేసుకోని చీమిడి కార్చుకుంటా వుండే సుపద్ర ఇప్పుడు వొంటికి బంగారం పూతేసినట్టు మెరస్తా వున్నింది.

సుపద్రకి రాజన్న అంటే పాణం. రాజన్నకి నేతి అత్తిరాసాలంటే ఇష్టమని నెంబరు బియ్యం పోసి నానేసి, పిండి కొట్టి, నేతిలో అత్తిరాసాలు కాల్చింది. కొంచెం తుంచి నోట్లో వేసుకుంటే వెన్న మాదిరి కరిగిపొయ్యి, సుపద్ర మనసంత తియ్యగా, కమ్మగా వున్నింది నేతి అత్తిరాసం.

రాయి తగులుకోని ముందుకి తూలిపడబోయినాడు రాజన్న.

గొర్రెలతాత బొక్కినోరు తెరిసి పకపకా నవ్వేసినాడు.

సిగ్గయిపాయింది రాజన్నకి.

''వయసు అట్లాంటిది అబ్బోడా! నెత్తురు మింద వున్నెప్పుడు ఏడు గుర్రాల మింద ఒకేసారి సవారి తీద్దామనిపిస్తింది'' అన్నేడు గొర్రెల తాత.

సెంటర్లో పాలుపోసి వచ్చేసరికి వాళ్ళమ్మ ఉడుకుడుగ్గా సంగటి చేసి, ఎర్రగడ్డలు ఎక్కువ తరిగి కోడిగుడ్ల పులుసు చేసింది.

మొగం కడుక్కోని సంగటి తినేసి కొడవలి తీసుకోని మడికాడికి యలబారినాడు.

''యాడికి రాజన్న యలబారినావు? నీతో పనుండాది. మల్లా అర్జింటుగా యలబారి ఊరికి పోవల్ల నేను'' అన్నేడు క్రిష్ణమామ.

''ఎందన్నా అప్పుడే ఊరికిపోవల్ల అంటా వుండావు?'' మొగం కడుక్కోని వచ్చి కొంగుతో తుడుచుకుంటా అనింది రాజన్న వాళ్ళమ్మ.

''బిన్నేపోవల్ల చెల్లే! ఓపినన్ని పనులుండాయి. మీకు ఓమాట చెప్పిపోదామని వస్తి'' అంటా బీడీ ముట్టించినాడు.

''రేపు పోవచ్చులే! ఏం పనులు మునిగిపోతా వుండాయి'' అనింది.

''లేదు చెల్లే ఒంటి కాలుమింద నిలబడి ఊపిరి తీసుకొనేదానికి తీరిక లేదు. ఒగమాట చెపతాను నువ్వేమీ అనుకోగూడదు. మాయన్న మాట మార్చినాడని నిష్టూరపోమాక. ఏంచేసేది మంచి సమందం. పిలగాడు తిరమల కొండమింద దేవస్తానంలో ఉద్దోగం చేస్తా వుండాడు'' అని నసిగినాడు.

''ఎవురి గురించినా నువ్వు చెప్పేది?''

''మన సుపద్ర గురించి. పిలగాడు మీ వొదినికి అన్నకొడుకు. కొండమింద హెలతు డిపార్టుమెంటులో పనిచేస్తా వుండాడు. మంచి జీతం. వచ్చే సుక్కురారం ముహూర్తాలు కట్టుకుంటా వుండాము. మీరుగూడా రావల్ల'' అని సావు కబురు సల్లంగా చెప్పినాడు.

ఆ మాటతో రాజన్న వాళ్ళమ్మ నిప్పుమింద పడిన ఉప్పయింది.

గొంతులో సుడులు తిరిగిన దుఖాన్ని బిగబట్టి,

''సుపద్ర ఎవురనుకుంటివి? నా కోడలు'' అనింది. కళ్ళల్లో నీళ్ల తిరిగినాయి.

''ఎన్నో అనుకుంటాం. మనం అనుకున్నెట్టు ఏదీ జరగదు. అంతా మన నుదుటిమింద ఆ బెమ్మ దేవుడు రాసిన రాత ప్రకారం జరిగితింది. ఆరాతను తప్పించేదానికి మనం ఎవురం?'' ఆరిపొయిన బీడీని చెవులో చెక్కుకున్నేడు.

క్రిష్ణమామ చానా తెలివిగా మాట్లాడతా వుండాడు.

''నేర్చిన మాటలు మాట్లాడొద్దన్నా! ఈ పెండ్లి ఎట్లా జరిగితిందో నేను చూస్తాను. పిల్లా పిలగోడు ఒకరినొకరు ఇష్టపడతా వుండారు. వాళ్ళిద్దరికీ ఏ గుళ్ళోనో పెండ్లి చేస్తాను'' అనింది కోపంగా.

''పెండ్లి చేసి నా బిడ్డ గొంతు కోస్తావా? నీ కొడుకును చేసుకుంటే నా బిడ్డ ఏం సుఖపడితింది'' అన్నేడు గద్దిస్తా.

''నా బిడ్డకేం? తాగుబోతా తిరుగుబోతా?'' అని అడిగింది రెట్టిస్తా.

''నీ బిడ్డ బుద్ధిమంతుడే కాదనను. వానికి సదువు అంతంతమాత్తరమే. చదువుకోని వున్నుంటే కొండమింద ఉద్యోగం తీసిచ్చి నా కూతుర్ని ఇచ్చి పెళ్ళి చేసుందు'' అన్నేడు.

''ఇప్పుడేం తక్కువ నా బిడ్డకు? భూమి నేల లేని బికారా నా బిడ్డ! సొంత ఆస్తి వుండాది. కష్టపడి పెళ్ళాన్ని సాక్కుంటాడు'' అనింది కొంగుతో కన్నీళ్ళను తుడుచుకుంటా.

''కష్టపడితే ఏం గుణం? చేసిన కష్టం మట్టిపాలు అవ్వాల్సిందేగాని చేతికందుతుందని నమ్మకం లేదు. నీ కొడుకును పెండ్లి చేసుకుంటే నా బిడ్డ ఎర్రటి ఎండలో కష్టపడల్ల, పస్తులతో అల్లాడల్ల, దరిద్రంతో కాపరం చెయ్యల్ల. అదే ఉద్యోగస్తుడ్ని పెళ్ళి చేసుకుంటే, రోజులు లెక్కపెట్టుకుంటా వుంటే చాలు, మొదలు తేదీన మూడు వేల రూపాయలు ఇంట్లో వచ్చి పడతాయి. ఏ దిగులు లేకుండా కాలుమింద కాలేసుకుని కాపరం చేస్తింది నా బిడ్డ'' అన్నేడు.

''నీ మొనుసులో ఎంత కుట్ర పెట్టుకోని వచ్చినావురా! నా కడుపు కాలస్తా వుండావు. నా ఉసురు నీకు తప్పకుండా తగిలితింది'' అని తిట్లు అందుకునింది.

''చెల్లే నిన్ను ఎన్నుమింద గువ్వను సాకినట్టు సాకితిమే. ఏ పొద్దన్నా ఇట్టుండే పుల్ల తీసి అట్టేసి ఎరుగుదువా? చిన్న వొగిసిలోనే ఎన్ని అగచాట్లు పడితివి. ఎన్ని అవమానాలు పడితివి. ఈడ్ని సాకేదానికి ఎన్ని తిప్పలు పడితివి. సేద్దిం జూదం గదా! చేసిన అప్పులు తీర్చలేక నీ మొగుడు పురుగుల మందు తాగి సచ్చె. వద్దు చెల్లే నీ గొంతుకోసినట్టు నా బిడ్డ గొంతు కొయ్యలేను. నువ్వు ఎన్నైన్నా తిట్టు నాకు బాధలేదు. నా బిడ్డ సుఖమే నాకు ముక్కెం. వస్తా చెల్లే...'' అని చెప్పి యలబారిపొయినాడు.

రాజన్న వాళ్ళమ్మ నిట్టాడుకి ఆనుకోని భలే ఏడ్చింది.

రాజన్నకి పాము కాటేసినట్టు వొళ్ళంతా తిమ్మిరెక్కింది. తల మొద్దుబారిపొయింది. మతాచారంగా కొడవలి పట్టుకోని మడికాడికి యలబారినాడు.

ఈదిలోకొస్తే ఎండ పెల్లున చెంప పగలకొట్టింది.

తలెత్తి చూసినాడు. ఆకాశంలో ఒక్క మోడం లేదు. తుడిసిపెట్టినట్టుండాది.

మడికాడికి వచ్చినాడు. ఎండిపొయిన మడి పీనిగిలా పడుండాది.

చెరువుకింద ఆడాడా గొడ్లు మేస్తా వుండాయి.

''రేయ్ రాజన్న తప్పుకో... దేవరెద్దు వస్తా వుండాది'' అని ఎవరో అరిసినారు.

తిరిగి చూసినాడు. రాత్తిరి కలలో తరిమిన దేవరెద్దు రంకెలేస్తా రాజన్న మిందకు వస్తా వుండాది.

ఇది కలా? నిజమా? అర్తం కావడంలేదు.

పాణాలను అరిచేతుల్లో పట్టుకొని పరుగునందుకొన్నేడు.

మోకాలెత్తు గెనాలను (వరిమడి గట్లు) ఎగిరెగిరి దాటుకుంటా వంక బాయి కాడికి పరిగెత్తినాడు.

తిరిగి చూసినాడు. దేవరెద్దు ఈపుమింద కొచ్చేసింది.

ఇరవై ఆరేళ్ళుగా కలలో తరిమింది. ఇప్పుడు నిజంగానే తరమతా వుండాది. ఇది కలగాదు.

పాణాలు కాపాడుకొనేదానికి బాయిలోకి దూకబొయ్యి, అట్నే నిచ్చలకపొయ్యి నిలబడిపొయినాడు.

బాయిలో చుక్క నీళ్ళు లేవు. ఎండిపొయుండాది.

అని కత చెప్పింది బత్తుడింటి దీపం.

ఈదర గాలికి రెపరెపమని తలలాడిస్తా కతని విన్నెయి దీపాలు. వాన చిటపటమని చిందులేస్తా కురస్తానే వుండాది.



## ... అండ్ ది విన్నర్ ఈజ్ రాణి

బాగ్‌బన్ సినిమాలో చిన్న వేషమైనా మహిమా చౌదరికి మంచి పేరు వచ్చింది. రవిచోప్రా ఇప్పుడు కొత్తగా తీస్తున్న బాబుల్ సినిమాలో కూడా మళ్లీ అమితాబ్, హేమమాలిని, సల్మాన్‌ఖాన్ వున్నారు. సల్మాన్ పక్కన వేషంకోసం చాలా మంది పోటీపడ్డారు. కానీ రవి మాత్రం కాజోల్‌మీద మనసుపడ్డాడు. ఏమైందో తెలీదుకానీ కాజోల్ చెయ్యనంది. ఆ విషయం తెలిసీతెలీగానే కజిన్ రాణిముఖర్జీ తనావేషం వేస్తానంది. రాణిది ఇందులో బిగ్ బి కోడలి వేషం. కొడుకు ప్రమాదంలో చనిపోతే అత్తగారు, మావగారూ కలిసి కోడలికి మళ్లీ పెళ్లి చేస్తారు. రవి సినిమాల్లో వుండే సెంటిమెంట్లన్నీ ఇందులోకూడా దండిగా వుంటాయి.